క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



ఆత్మకూరు: పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని మోడల్ గిరిజన కాలనీకి చెందిన మల్లిక రమేష్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదు చెక్కును మున్సిపల్ వైస్‌చైర్మన్ కేవీ శ్రావణ్‌కుమార్ శుక్రవారం అందజేశారు. రమేష్ రెండ్రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. కర్మక్రతువులకు తక్షణ సాయంగా వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేలు చెక్కును కుటుంబసభ్యులకు అందజేసినట్లు వైస్ చైర్మన్ తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రమీల, మాజీ వార్డు సభ్యుడు తోడేటి మణి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ఉదయగిరి: గండిపాళెంలోని ఏపీ బాలుర గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు స్మాల్‌పాక్స్(అమ్మవారు) సోకడంతో మండల వైద్యాధికారిణి ఎం శివకల్పన శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం డార్మెంటరీ, భోజనశాలను పరిశీలించి గురుకుల సిబ్బందికి సూచనలు చేశారు. ఆరోగ్యబోధకుడు కలసపాటి వెంకటసుబ్బయ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ నౌషాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ధనరాజ్, పర్యవేక్షకుడు అక్బర్‌బాషా, సిబ్బంది చంద్రమౌళి, విజయకుమారి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్లతో ఆర్థికాభివృద్ధి



వరికుంటపాడు: స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెరటికోళ్లను అందజేస్తోందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వైనారూత్ తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సీసీలు, వీఓఏలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ పెరటికోళ్ల యూనిట్ ధర రూ.3,500 కాగా, 20 కోళ్లు, దాణా, మందులు అందజేస్తుందని తెలిపారు. మండలానికి 100 యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. పొదుపు సభ్యులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. సీసీలు జానకి, వెంకటరమణమ్మ, ప్రమీల, ప్రభావతి, రవి పాల్గొన్నారు.

బాలకృష్ణమ్మకు నివాళి



ఆత్మకూరు: ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు ఏటీఎఫ్ ద్వితీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ విద్యారంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. బాలకృష్ణమ్మ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి ఏపీటీఎఫ్ నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు సోమవరపు భాస్కర్‌రెడ్డి, ఆర్ వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు మల్లికార్జున, వై శివరామిరెడ్డి, చంద్రమోహన్, ఫణికుమార్ పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి



ఆత్మకూరురూరల్: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ ఉషారాణితో కలిసి శుక్రవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల వలంటీర్ల పనితీరుపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వలంటీర్ల పనితీరుపై నివేదికలు తయారు చేసి అందజేస్తే పనిచేయని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కరటంపాడు సంపద తయారీ కేంద్రాన్ని ట్రైనింగ్ సెంటర్‌గా ప్రభుత్వం ఎంపిక చేసిందని, అక్కడ మరిన్ని వసతుల కల్పనకు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి రూ.2 లక్షలు కేటాయించారని తెలిపారు.

భూపంపిణీ పేదలకు వరం

అనుమసముద్రంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నిరుపేదలకు భూపంపిణీ కార్యక్రమం వరమని తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. ఏఎస్‌పేటలోని సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ భూము లను గుర్తించి నిరుపేదలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం గ్రామసభలు నిర్వహించి భూమి లేని నిరుపేదల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారు. వీఆర్వో హజరత్తయ్య, మీరావళి, వైఎస్సార్‌సీపీ నాయకులు జిలానీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కలిగిరి: పంట మార్పిడి ద్వారా రైతులు లాభాలు పొందవచ్చునని వింజమూరు ఏడీఏ రామిరెడ్డి అన్నారు. వెలగపాడు పంచాయతీ కొత్తూరులో సాగుచేసిన పంటలను శాస్త్రవేత్తలతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న శనగతోటల్లో ప్రత్యామ్నాయంగా ను వ్వుల పంటను సాగు చేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు ఓబయ్య, విజయకుమార్‌నాయక్, డీడీఏ శివనారాయణ, ఏఓ సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఉదయగిరి: క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్రం సౌజన్యంతో పినాకిని యూత్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న బ్లాక్‌స్థాయి క్రీడాపోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. అనంతరం వాలీబాల్, ఖోఖో, షాట్‌పుట్, 100 మీటర్ల పరుగుపందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ ఏ నరసింహారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు కే మురళీమోహన్‌రాజు, పీడీలు రమేష్, రాజు, శివసాయికుమార్‌రాజు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత ఏఎస్సార్ కళాశాల జట్టు

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్సార్‌జేడీ కళాశాల మైదానంలో మూడ్రోజులుగా జరుగుతున్న వీఎస్‌యూ అంతర్ కళాశాలల జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్సార్‌జేడీ కళాశాల జట్టుపై ఏఎస్సార్ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. ఎస్ఆర్‌జేడీ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఫిబ్రవరిలో వర్సిటీ క్యాంపస్‌లో జరిగే సెంట్రల్ జోన్ పోటీల్లో రెండు జట్లు పాల్గొననున్నట్లు పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం విజేత, రన్నర్ జట్లకు షీల్డులు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ వరకుమారి, వర్సిటీ పరిశీలకుడు ప్రవీణ్‌కుమార్, లైబ్రేరియన్ టీ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఉదయగిరి: బహుమతులు అందుకుంటున్న విజేతలు



విజేతగా నిలిచిన ఆత్మకూరు ఏఎస్సార్‌సీ జట్టు

ఉత్కంఠగా వైఎస్ జగనన్న క్రికెట్ పోటీలు

కావలి రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గత నెలలో ప్రారంభించిన నియోజవర్గ స్థాయి వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి రౌండ్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం తుమ్మలపెంటరోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో ఇసుకపల్లి లెవన్స్‌పై అమ్మలెవెన్స్ జట్టు 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. 4 వికెట్లు తీసిన మూర్తికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. రెండో మ్యాచ్‌లో శ్రీరాంపురం లెవెన్, బైనేటిపాళెం అంబేడ్కర్ యూత్ జట్లు తలపడగా, శ్రీరామపురం జట్టు వికెట్ నష్టపోకుండా విజయం సాధించింది. 3 వికెట్లు తీసిన ప్రతాప్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. మూడో మ్యాచ్‌లో ఆర్‌పీపీ యూత్‌పై ధమాకా లెవెన్స్ భారీ విజయం సాధించింది. 41 బంతులలో 61 పరుగులు సాధించిన మున్నాబాయ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి

ఉదయగిరి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటోందని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ పరిసర ప్రాంతాల్లో గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రుల్లో వైద్యసిబ్బందిని నియమించడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. పల్లెల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. ప్రభుత్వ వైద్య పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యపర్చాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అక్కి భాస్కరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, వైద్యసిబ్బంది నౌషాద్, అక్బర్‌బాషా, చెన్నయ్య, శ్రీనివాసులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

విద్వేషపూరిత కథనాలపై ఆత్మవిమర్శ చేసుకోవాలి

కావలి: జర్నలిస్టులకు ఏదైనా మంచి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భావించినా, కొందరు జర్నలిస్టులు మీడియా సంస్థలతో చేతులు కలిపి విద్వేషపూరిత కథనాలను ప్రచురిస్తూ అడ్డు పడుతున్నారని, ఈ విషయంపై జర్నలిస్టులు చర్చించుకుని ఆత్మవిమర్శ చేసుకోవాలని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సూచించారు. కావలిలోని ప్రెస్‌క్లబ్‌ను శుక్రవారం ఆయన సందర్శించి విలేకరులతో వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రభుత్వ పాలనలో లోపాలు ఉంటే ఎత్తి చూపడంలో తప్పులేదన్నారు. ప్రభుత్వంపై విద్వేషంతో కల్పిత కథనాలు వండివార్చడం మంచిదికాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఇష్టానుసారంగా పంచేస్తున్నారని కొందరు జర్నలిస్టులు వార్తలు రాసేస్తున్నారాన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధికి కొన్ని పత్రికలు, టీవీ ఛానళ్లు ఏ రకంగా అడ్డం పడుతున్నాయో జర్నలిస్టులు గమనించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు నివేశన స్థలాలు అడుగుతున్నారు..ప్రభుత్వం కూడా ఇవ్వాలనే అభిప్రాయంతోనే ఉందన్నారు. కొన్ని మీడియా సంస్థలు బురదజల్లుతాయనే భావనతో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎలా ఇవ్వాలని ప్రభుత్వం పరిశీలన చేస్తోందన్నారు. తొలుత కొమ్మినేనిని విలేకరులు ఘనంగా సత్కరించారు.

విద్యారంగంలో జవహర్ భారతిది చెరగని ముద్ర

విద్యా రంగంలో కావలి జవహర్ భారతి విద్యా సంస్థలు చెరగని ముద్ర వేశాయని, సేవే పరమావధిగా జేబీ విద్యాసంస్థల ద్వారా ఎందరో నిరుపేద విద్యార్థులకు విద్యా దానం చేసిన ఘనత డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) కే దక్కిందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జవహర్ భారతి కళాశాలకు శుక్రవారం ఆయన సందర్శించారు. డీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. జవహర్ భారతి కళాశాల డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకోవడం అభినందనీయమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని కొనియాడారు. విద్యా సంస్థల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ సన్నీశ్యామ్యూల్, తాతిరెడ్డి, మాల్యాద్రి, సీతాకుమారి, తదితరులు పాల్గొన్నారు.



కొమ్మినేనిని సత్కరిస్తున్న విలేకరులు

ప్రభుత్వ పథకాల అమల్లో చొరవచూపాలి

అల్లూరు: ప్రభుత్వ పథకాల అమల్లో అధికారులు చొరవచూపాలని ఎంపీపీ శశిరేఖ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలన్నారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీరామకృష్ణ, ఎంపీడీఓ శ్రీదేవి, వైస్‌ఎంపీపీ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శశిరేఖ

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

వింజమూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర ఆర్‌వైఎస్ఎస్ కోఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వింజమూరులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతులు భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆర్‌వైఎస్ఎస్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య, ఏడీఏ ఎన్ రామిరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

కావలి రూరల్: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని కావలి ఎస్ఈబీ ఎస్సై కే శ్రీనివాసరావు సూచించారు. ముద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎస్ఈబీ టోల్‌ఫ్రీనంబర్ 14500పై అవగాహన కల్పించి వారితో మాదక ద్రవ్యాల జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మత్తు పదార్థాల నిషేధిత కమిటీని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ టీవీరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు అఖిలపక్ష రైతు సదస్సు

మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులో అఖిలపక్ష రైతు సదస్సును ఆదివారం నిర్వహించనున్నట్లు రైతు సంఘ నాయకుడు మూలి వెంగయ్య శుక్రవారం తెలిపారు. సోమశిల హైలెవల్ కెనాల్‌ను పూర్తి చేస్తే మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు నాయకులు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి గ్రామసభలు

మర్రిపాడు: మండలంలో శనివారం నుంచి 13వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హేమంత్ కుమార్ శుక్రవారం తెలిపారు. భూమిలేని నిరుపేదల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నేడు గంధ మహోత్సవం

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని దర్వేషావలి దర్గాలో శనివారం గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్ శుక్రవారం తెలిపారు. గంధాన్ని హక్కుదారుల ఇంటి నుంచి ఊరేగింపుగా దర్గాకు చేర్చి ప్రత్యేక ప్రార్థనలు, చదివింపుల అనంతరం భక్తులకు పంచి పెట్టనున్నట్లు వివరించారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

విజిలెన్స్ తనిఖీలు

వింజమూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డీసీటీఓ కే విష్ణురావు మాట్లాడుతూ సీహెచ్‌సీలో అన్ని విభాగాలను తనిఖీ చేశామని తెలిపారు స్టాఫ్‌నర్సులు ఆరుగురు ఉండాల్సి ఉండగా, ఒక్కరే ఉండడంతో వైద్యసేవలు సరిగా అందడం లేదన్నారు. ఆస్పత్రికి ఆర్వో వాటర్‌ప్లాంట్, జనరేటర్ సౌకర్యాలు లేవన్నారు. ఎక్స్‌రే ప్లాంట్ ఉన్నా ఉపయోగంలో లేకపోవడాన్ని గుర్తించామని తెలిపారు. ఈ విషయాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేస్తామన్నారు. ఆయన వెంట విజిలెన్స్, వైద్యసిబ్బంది ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు ఆహ్వానం



చేజర్ల: ఎంజీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను చేజర్లలో ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు సంగం సీఐ రవినాయక్, ఎస్సై మరిడినాయుడును టోర్నమెంట్ ప్రారంభానికి ఆహ్వానించారు. సీఐ చేతుల మీదుగా ఆత్మకూరు నియోజకవర్గస్థాయిలో జరిగే ఎంజీఆర్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు ఆనంద్‌రెడ్డి టోర్నమెంట్ నిర్వాహకులు కళ్యాణ్, మాజీ ఎంపీటీసీ గణేష్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన



వింజమూరు: ఇందిరానగర్‌లో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సొసైటీ అధ్యక్షు డు జూపల్లి రాజారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ట్రైయినీ కలెక్టర్ సిఫార్సు మేరకు ఇందిరానగర్ అభివృద్ధికి కలెక్టర్ రూ.10లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో గిరిజనులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు రాజారావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ వెంగమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బీ శ్రీరాములురెడ్డి, నాయకులు మద్దూరు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ గువ్వల మల్లికార్జున, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులను దూషించడంపై ఫిర్యాదు

కావలి : అధికారులను కులం పేరుతో దూషించడమే కాకుండా, తాము అధికారంలోకి వస్తే మీ అంతుచూస్తామని బెదిరించిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ నాయకులు కోరారు. ఈ మేరకు ఎస్పీ సీహెచ్ విజయారావుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 29న కావలిలో నిర్వహించిన టీడీపీ రోడ్‌షోలో టీడీపీ నాయకులు బీద రవిచంద్ర, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు, మల్లిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, మన్నవ రవిచంద్ర కావలి డీఎస్పీ, ఆర్డీవోలను కులం పేరుతో దూషిస్తూ అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా బెదిరించారని విన్నవించారు. అలాగే మున్సిపల్ కమిషనర్ ఇంటి వద్దకు వెళ్లి నానా దుర్భాషలాడారని ఆరోపించారు. టీడీపీ ఉనికిని చాటుకునేందుకు దళిత సోదరుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని అధికారులపై దౌర్జన్యాలు చేస్తూ అలజడి సృష్టిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కుందుర్తి కామయ్య, గంధం ప్రసన్నాంజనేయులు, ఏ రాజేష్, కుందుర్తి శ్రీనివాసులు, పరుసు మాల్యాద్రి, చేవూరు కిరణ్, దళిత నాయకులు, తదితరులు ఉన్నారు.



ఎస్పీకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

9న ఏపీజీఈఏ ఎన్నికలు

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఆత్మకూరు తాలూకా కార్యవర్గ ఎన్నికను ఈ నెల 9న నిర్వహించనున్నట్లు ఆ సంఘ ఉదయగిరి తాలుకా అధ్యక్షుడు ఎస్ కొండారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు తాలూకా పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

సన్మానం



సీతారామపురం: స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా ప్యాప్టో డిప్యూటీ సెక్రటరీగా ఎన్నికైన అప్పన ఏడుకొండలును శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సభ్యులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

అల్లూరు: అల్లూరుపేట పోలేరమ్మ ఉత్సవ ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించి అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించే పోలేరమ్మ ఉత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందన్నారు. అందుకనుగుణంగా పోలేరమ్మ ఆలయానికి చేరుకునే అన్నీ దారుల్లో భక్తులు రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.



ఉత్సవ ఏర్పాట్లపై సూచనలిస్తున్న మన్నెమాల

ప్రజల రక్షణ కోసమే జీఓ నంబర్ 1

ఆత్మకూరు: రాష్ట్ర ప్రజల ప్రాణాలను కాపాడడం కోసం ప్రభుత్వం గత జీఓను పునఃపరిశీలించి జీఓ నంబర్ 1ను తీసుకొచ్చిందని, అందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని ఆత్మకూరు డీఎస్పీ ఎన్ కోటారెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు సీఐ కార్యాలయంలో ఎస్సై ఎం శివశంకర్‌రావుతో కలిసి శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల కందుకూరు, గుంటూరులో రాజకీయ సభల్లో తొక్కిసలాటలు చోటుచేసుకుని ప్రజలు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ప్రభుత్వం జీఓ నంబరు 1ను విడుదల చేసిందని తెలిపారు. రోడ్లపై ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. మైదానాల్లో సభలు, సమావేశాలు పెట్టుకునేందుకు తప్పనిసరిగా జిల్లా ఎస్పీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా నిషేధిత కోడిపందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కావలి : మాట్లాడుతున్న డీఎస్పీ ఎం వెంకటరమణ



ఆత్మకూరు: మాట్లాడుతున్న డీఎస్పీ ఎన్ కోటారెడ్డి

రోడ్లపై సభలు, సమావేశాలపై నిషేధం

కావలి రూరల్: ప్రభుత్వ జీవో నంబర్ 1 ప్రకారం రోడ్లు, మార్జిన్లలో బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించడంపై నిషేధం విధించినట్లు కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల కందుకూరు, గుంటూరులో రోడ్లపై నిర్వహించిన సభల్లో తొక్కిసలాటలు చోటు చేసుకుని అమాయక ప్రజల ప్రాణాలను కోల్పోయారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నూతన జీవోను తీసుకొచ్చిందని తెలిపారు. ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కరమైన రోడ్లపై సభలు, సమావేశాలకు అనుమతులు ఉండవని, ప్రజలకు ఇబ్బంది లేని చోట మాత్రమే పరిశీలించి అనుమతులు ఇస్తామన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

సోమేశ్వరాలయం పరిశీలన



సోమశిల: సోమశిలలోని కామాక్షిదేవి సమేత సోమేశ్వరాలయాన్ని దేవాదాయ శాఖ స్థపతి పీ పరమేశ్వరప్ప శుక్రవారం పరిశీలించారు. 2021లో వరదలకు ఆలయం దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆలయ పరిస్థితిని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి చేయాలని విన్నవించారు. ఈ మేరకు ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా స్థపతి పరిశీలనకు వచ్చినట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. జిల్లా స్థపతి సురేంద్ర, ఏఈఈ మురళీమోహన్, ఈఓ పెంచలవరప్రసాద్, ఆలయ వంశపార్యంపర్య ధర్మకర్త ఉప్పల విజయకుమార్, అర్చకులు రామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పొగాకు సాగులో మెళకువలు పాటించాలి

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలోని డీసీపల్లి, నందవరం, గుండెమడగల, భైరవరం గ్రామాల్లో పొగాకు పంట, క్యూరింగ్‌ను పొగాకు బోర్డు అధికారులు, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, పొగాకు కంపెనీల ప్రతినిధులతో కూడిన బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పొగాకు బోర్డు అధికారి సిద్ధిరాజు మాట్లాడుతూ పొగాకు పంటకు సీటీఆర్ఐ సూచించిన పురుగు మందులను మాత్రమే వాడాలని సూచించారు. పురుగు మందులకు బదులుగా లింగాకర్షక బుట్టలు, పసుపు అట్టలను వాడాలన్నారు. ఎర పంటగా బంతి మొక్కలను నాటుకోవాలని సూచించారు. క్యూరింగ్‌కు బాగా పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే రెల్చుకోవాలన్నారు. పొగాకులో అన్యపదార్థాలు కలవకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్, కంపెనీల ప్రతినిధులు వెంకటరావు, రామాంజనేయులు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



నందవరంలో పొగాకును పరిశీలిస్తున్న అధికారులు

అంతర సేద్యం తప్పనిసరి

కలిగిరి: పొగాకు తోటల్లో అంతర సేద్యాన్ని తప్పనిసరిగా చేయాలని కలిగిరి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి ఎం సత్యశ్రీనివాస్ సూచించారు. కలిగిరి పొగాకు బోర్డు పరిధిలోని కృష్ణారెడ్డిపాళెం, వెలగపాడు, కొత్తూరు, శెట్టిపాళెం గ్రామాల్లో సాగు చేసిన పొగాకు పంటను పొగాకుబోర్డు అధికారులు, రైతుమిత్ర బృందం, ట్రేడ్ మిత్రులు శుక్రవారం సందర్శించారు. రైతులకు నాణ్యమైన పొగాకు దిగుబడుల సాధనకు పాటించాల్సిన మెళకువలను సూచించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

వింజమూరు: ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా నాయకులను కలుసుకుని అభిప్రాయాలు సేకరిస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కే ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఐదు సచివాలయాల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులను శుక్రవారం ఆయన కలిశారు. తొలుత జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు గువ్వల కృష్ణారెడ్డిని వారి నివాసాల్లో కలిసి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం కలిశారు. అనంతరం ఆర్అండ్‌బీ బంగ్లాలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ మోహన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావును కలిసి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీని రాబోయే ఎన్నికల్లో సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలన్నారు.



పార్టీ నాయకులను సన్మానిస్తున్న ధనుంజయరెడ్డి

సంగమేశ్వరుడికి అన్నాభిషేకం

సంగం: శివముక్కోటి సందర్భంగా స్థానిక సంగమేశ్వరాలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలోని పాతాళ శివలింగం వద్ద అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం అభిషేకం చేసిన అన్నాన్ని ఊరేగింపుగా పెన్నానది వద్దకు తీసుకెళ్లి అందులో కలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కంటాబత్తిన శ్రీహరిరెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



పాతాల శివలింగం వద్ద అన్నాభిషేకం చేస్తున్న భక్తులు